క్లుప్తంగా

తిరుపతి కమిషనర్‌గా హరిత



తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా డి.హరితను నియమిస్తూ ప్రభు త్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత కమిషనర్ అనుపమ అంజలి బదిలీ కావడంతో ఆమె స్థానంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న డి.హరితను నియమించారు. హరిత గతంలో అదనపు కమిషనర్‌గా ఇక్కడే విధులు నిర్వహించారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



షెకీనా చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేబీ లేఅవుట్‌లోని షెకీనా చర్చిలో పాస్టర్ అరుల్ అరుసు ఏసు క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జోయల్, బాబూరావు, జోసెఫ్, దయాలన్, ప్రభుకిరణ్, చరణ్ చందు, మోనికా, జెస్సీ, లక్ష్మీమోసస్, క్రైస్తవ కుటుంబాలు పాల్గొన్నారు.

రక్తదానం



తిరుపతి తుడా: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జగన్మాత చర్చి వద్ద స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 72 మంది విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ సంధ్య, చంద్రకళ, సునీల్, గీత పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం వితరణ



తిరుపతి కల్చరల్: బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ పుట్టిన రోజును పురస్కరించుకుని కాపు సంక్షేమ యువసేన, బలిజ జేఏసీ సంయుక్తంగా శుక్రవారం మెటర్నిటీ హాస్పిటల్ వద్ద సుమారు 300 మంది పేదలకు అల్పాహారం వితరణ చేశారు. ఈ సందర్భంగా కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బలిజ జేఏసీ కార్యదర్శి ఆళ్వారు మురళి, ఆళ్వారు రవీంద్ర, కేశంశెట్టి రవి, శంకరప్ప, రామారావు పాల్గొన్నారు.

హేమలత, వేణుగోపాల్ నుంచి కాపాడండి



మాట్లాడుతున్న మహేశ్వరి

తిరుపతి కల్చరల్: కొర్లగుంటకు చెందిన ఆర్పీ హేమలత దేవదాయ శాఖ ఉద్యోగి వేణుగోపాల్ తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని, కాపాడాలని బాధితురాలు ఆర్.మహేశ్వరి కోరారు. ఆమె శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కొర్లగుంటలో హేమలత ఆర్పీగా పనిచేస్తోందని తెలిపారు. తాను ఆమె వద్ద వుంటూ చెప్పిన పనులు చేస్తుండేదానినన్నారు. హేమలత ఇంటికి వచ్చి వెళ్లే దేవదాయ శాఖ ఉద్యోగి వేణుగోపాల్ తనకు రాత్రుళ్లు వాట్సాప్ కాల్స్ చేస్తుండడంతో అభ్యంతరం చెప్పినట్టు పేర్కొన్నారు. దీంతో కక్ష కట్టిన వారు తిరుమలలో వ్యాపారం చేసుకుంటున్న తన భర్తను మనుషులతో కొట్టించారని వాపోయారు. డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి వసూలు చేసిన డబ్బుతో హేమలత అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తోందని, దీనిపై తాను ప్రశ్నిస్తాననే నెపంతో తనను వేధిస్తోందని ఆరోపించారు. తాను తీసుకున్న అప్పుకు వడ్డీ, అసలు చెల్లించినా ఇంకా చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నట్టు తెలిపారు. ఈ విషయంపై పోలీసులతోపాటు నగర పాలక సంస్థ కమిషనర్‌కు విన్నవించినట్టు పేర్కొన్నారు. హేమలతకు కొర్లగుంటకు చెందిన టీడీపీ నాయకురాలు సత్యవతి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు సంజయ్ అండగా ఉన్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయకపోతే తిరుపతి అర్బన్ జిల్లా పోలీసు కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





ప్రముఖ సినీ నటులు అల్లరి నరేష్, గోపీచంద్

తిరుమల: శ్రీవారిని శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, తెలంగాణ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, చంద్ర పాటిల్, సినీ నటులు అల్లరి నరేష్, గోపీచంద్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ప్రజలు మనస్ఫూర్తిగా ఆదరిస్తున్నారు

- ప్రజల నోటితోనే జగనన్నే మా భవిష్యత్తు అనిపిస్తాం
- చంద్రబాబు మోసాలను వివరిస్తాం
- 'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి





ఇంటి వద్ద ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం : 'రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో మంచి చేశారు. అందుకే ప్రజలు మమ్మల్ని మనస్ఫూర్తిగా ఆదరిస్తున్నారు' అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కార్పొరేటర్ కోటూరు అంజనేయులు ఆధ్వర్యంలో 13వ డివిజన్ ఎస్టీవీనగర్‌లో 'జగనన్నే మా భవిష్యతు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, పరిపాలనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కవితమ్మ, సుజాతమ్మ, బూమ్రా తదితర మహిళలు మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ పథకాలతోనే సంతోషంగా జీవిస్తున్నామని, గతంలోలా ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా వలంటీర్లు సచివాలయాల ద్వారా నేరుగా అందజేస్తున్నారని వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలని, ఇందుకు తాము జగనన్నకు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. జగనన్నే మా ఊపిరి, జగనన్నే మా భవిష్యత్తు అంటూ స్థానిక ప్రజలు పేర్కొన్నారు. అనంతరం వారు తమ ఇంటికి జగనన్న స్టిక్కర్‌ను అంటించుకున్నారు. జగనన్న ఫోన్‌కి కాల్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలు అన్నీ ఇన్నీ కావని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గుర్తు చేశారు. జన్మభూమి కమిటీల పేరుతో పేదలకు పథకాలు అందకుండా చేశారని వివరించారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇప్పించలేదన్నారు. రుణ మాఫీ చేస్తామని డ్వాక్రా మహిళలను మోసం చేశారని తెలిపారు. అలాంటి ప్రజాద్రోహి అయిన చంద్రబాబుకు జగనన్నే మా భవిష్యత్తు అని ప్రజల నోటితోనే చెప్పిస్తామన్నారు. దేశ రాజకీయాల్లోనే ఎక్కడా లేని విధంగా 7.5 లక్షల మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజల్లోనే ఉండి వారికి సేవలు అందించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తోందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాపూరి ప్రసాద్, సూరి నారాయణ, శశి, మునీశ్వరమ్మ, రాణెమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ 27, 29, 14వ డివిజన్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు.

తిరుపతి తుడా : అదేవిధంగా కార్పొరేటర్ శేఖర్ రెడ్డి పలువురు నాయకులతో కలిసి 42వ డివిజన్‌లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వారు ప్రభుత్వ నుంచి పొందుతున్న పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు లింగం రమేష్, శివరాజు, చెంచయ్య యాదవ్, పవన్, సతీష్ రెడ్డి, రవి, సురేష్ కుమార్, గృహ సారథులు వినయ్, సుధాకర్, బాలరాజు పాల్గొన్నారు.



అభిప్రాయాలు సేకరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ముద్ర నారాయణ



పథకాల గురించి వివరిస్తున్న కార్పొరేటర్, నేతలు

అన్నప్రసాదాల పంపిణీ ప్రారంభం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు

- ప్రతి శుక్రవారం అన్నదానం
- ఇప్పటికే ప్రారంభమైన ఊంజల్ సేవ
- ఆనందం వ్యక్తం చేస్తున్న భక్తులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ శుక్రవారం రాహుకాల పూజలు విశేషంగా జరుగుతాయి. ఈ పూజల్లో చంద్రగిరితో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. దీంతో దర్శన సమయాన్ని కూడా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ప్రతి శుక్రవారం జరిగే రాహుకాల పూజ (ఉదయం 10.30 గంటల నుంచి 12 వరకు)లకు వచ్చే భక్తులు ఆకలితో ఆకలితో ఇబ్బంది పడుతున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన చెవిరెడ్డి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేయాలని సంకల్పించారు. అన్నదానం కోసం దాతల సహకారం తీసుకోవాలని, అలా లేనపుడు ఎమ్మెల్యే కుటుంబం తరపున పంపిణీ చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే ప్రతి శుక్రవారం అన్నదానం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం అమ్మవారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రానికి చేరుకుని భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి శుక్రవారం దాతగా వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ముందుకు వచ్చి సుమారు వెయ్యి మంది భక్తులకు భోజనం తయారుచేయించారు.

సంప్రదాయబద్ధంగా ఊంజల్ సేవ

అమ్మవారి ఆలయంలో సంప్రదాయ బద్ధంగా ఊంజల్ సేవను నిర్వహించారు. గతంలో ఊంజల్ సేవ లేదు. ఈ సేవను అందుబాటులోకి తీసుకురావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా భక్తులు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు అమ్మవారిని ఊరేగించేలా పాలక మండలి నిర్ణయం తీసుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటరత్నం, ఎంపిటిసి మాధవరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, నాయకులు చేగు గోవర్ధన్ గుప్తా, సిఎం. కేశవులు, మల్లం రాజశేఖర్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

డీఎంఈగా సీనియర్లకు అవకాశం కల్పించండి



మంత్రి పెద్దిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి తుడా: డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పోస్టులో సీనియర్ వైద్యులను నియమించేలా చొరవ తీసుకోవాలని ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వారు శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ జీవో నంబర్ 1504 ప్రకారం వైద్య, విద్య సంచాలకులుగా వైద్యుల్లో సీనియర్లను గుర్తించి ఒకరికి అవకాశం ఇవ్వాలని కోరారు. తద్వారా వైద్య రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లవచ్చన్నారు. టైం బౌండ్ ప్రమోషన్, 2015 నుంచి పీఆర్సీ, అరియర్స్ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాయుడు, ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ సాధన, డాక్టర్ రవిశంకర్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

తిరుపతి తుడా: ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై ఆస్పత్రుల యాజమాన్యంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే భూమన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తిరుపతి మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అదే స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ వైద్యులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్య సేవలు అందించారని కొనియాడారు. తాను నాలుగు సార్లు కరోనా బారిన పడ్డానని, నేడు ఇంత ఆరోగ్యంగా ఉండడానికి కారణం వైద్యులేనని ఆనందం వ్యక్తం చేశారు. ఇకపైనా ఇదే స్ఫూర్తితో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. గంగమ్మ ఆలయ పునః నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందించడంలో తిరుపతి జిల్లా ముందుండడం గొప్ప విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీ ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డీఐవో డాక్టర్ శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

మే 5న మహా కుంభాభిషేకం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

- 15 నుంచి గంగమ్మ జయమాలధారణ దీక్ష
- ప్రతిరోజూ కనకధారా స్తోత్ర పూర్వక మహాలక్ష్మీ మంత్ర హోమం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెల్లడి

తిరుపతి కల్చరల్: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకాన్ని మే 5న ఘనంగా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్‌తో కలిసి మహా కుంభాభిషేకం, గంగమ్మ జయమాలధారణ దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులతో ప్రతిరోజూ ఆలయంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు కనకధారా స్తోత్ర పూర్వక మహాలక్ష్మీ మంత్ర హోమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. హోమానికి కావాల్సిన వస్తువులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. అలాగే 15 నుంచి మే 6వ తేదీ వరకు నూతనంగా గంగమ్మ జయమాలధారణ దీక్ష అర్ధ మండల దీక్షను చేపట్టనున్నట్టు తెలిపారు. గంగజాతరను పురస్కరించుకొని ఆలయం దక్షిణ వైపునున్న ఖాళీ స్థలం నుంచి మహా కుంభాభిషేకం, గంగజాతర భద్రతా కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆలయ చైర్మన్ కట్టాగోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్యను ఆదేశించారు. తిరుపతికి చెందిన జి.గంగులమ్మ అమ్మవారి ఆలయ మహా కుంభాభిషేకం కోసం తన వంతుగా రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు టి.వెంకటేశ్వరరావు, పి.ధనశేఖర్, వి.గీత, ఎస్.భారతి పాల్గొన్నారు.

విప్లవాత్మక సంస్కరణలతో ఆదర్శ పాలన

- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రారంభం
- వెనుకబడిన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



పుదిపట్లలో మా నమ్మకం నువ్వే జగన్‌లో పాల్గొన్న మునీశ్వర్‌రెడ్డి, నాయకులు

భాకరాపేట: రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో కూడిన ఆదర్శ పరిపాలనను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎర్రావారిపాళెం మండలం ఉస్తికాయల పెంట పంచాయతీలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ రాజకీయాల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల హామీలను అమలు చేసి సీఎం జగనన్న చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కన్వీనర్లు, గృహ సారథులకు సూచించారు. ప్రజా మద్దతు పుస్తకంలో పొందపరిచిన అంశాలను సేకరించాలని పిలుపునిచ్చారు. నాయకులు శివలక్ష్మి, నాగార్జున రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చెంగల్ రెడ్డి, రమేష్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నమ్మకమైన పాలనకు ప్రతీక జగన్

తిరుపతి రూరల్: పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతితోపాటు నమ్మకమైన పాలనకు ప్రతీకగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని తిరుపతి రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వరరెడ్డి కొనియాడారు. తిరుపతి రూరల్ మండలం వ్యాప్తంగా శుక్రవారం నుంచి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. పుదిపట్ల పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడప గడపకూ వెళ్లి ప్రజాసాధికారిక సర్వే నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీటీసీలు మూలం చంద్రమోహన్‌రెడ్డి, శ్రీకాంత్, సర్పంచులు జోగి మోహన్, బడి వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల ఎన్నికలు వద్దు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం కార్యవర్గ పదవులకు ఎన్నికలు నిర్వహించకూడదని ఉద్యోగులు తీర్మానించినట్టు రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు సూపరింటెండెంట్ మజ్జిగ చంద్రశేఖర్ తెలిపారు. తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయాన్ని సభ్యులు అంగీకరించలేదన్నారు. ఇటీవల కొంతమంది ఉద్యోగులు వివిధ కోర్టుల్లో చేరారని, వారికి ఉద్యోగ సంఘంలో సభ్యత్వం ఇచ్చిన తర్వాతే పదవులకు ఎన్నికలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు చెప్పారు. చిత్తూరులో ఎన్నికలు నిర్వహిస్తే వాటిని అందరూ కలిసి అడ్డుకుంటామని చెప్పినట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం మాజీ కార్యదర్శి సుబ్రమణ్యం ఆచారి, తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, చిత్తూరు రవి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

పుత్తూరు రూరల్ : స్థానిక గేటువీధిలోని పట్టాభిరామాలయంలో శుక్రవారం సీతారాముల వారి కల్యాణం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణం చేస్తున్న వేద పండితులు

పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లిలో శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం విశేషంగా అలంకరించి సీతారాములకు కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగించారు.

చెట్టును ఢీకొన్న కోళ్ల వ్యాను



ప్రమాద స్థలిలో క్షతగాత్రులు

- నలుగురికి గాయాలు

శ్రీరంగరాజపురం: ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కోళ్ల వ్యాను చెట్టును ఢీకొంది. ఈ ఘటన చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని నెళవాయి వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నగరి నుంచి బెంగళూరు వెళుతున్న కోళ్ల వ్యాను నెళవాయి వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తితో పాటు కోళ్ల వ్యానులోని ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న శ్రీరంగరాజపురం తహసీల్దార్ లోకనాథపిళ్లై ప్రమాదాన్ని గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రథోత్సవం.. భక్తి పారవశ్యం



పురవీధుల్లో వైభవంగా సాగుతున్న రథోత్సవం

గూడూరు: జై శ్రీరాం.. జై శ్రీరాం అంటూ రథం లాగుతూ భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. స్థానిక కోనేటిమిట్టలోని సీతారామంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల రథోత్సవం కనుల పండువగా సాగింది. శుక్రవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాములను రథంలో కొలువుదీర్చి పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. పలు కూడళ్లలో భక్తులు వారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.